

రథంపై కొండమీదరాయుడి వైభవం



దేవరకొండవాసా..
వెంకటరమణా..
గోవిందా.. గోవింద..

# కొండంత పండుగ



- వైభవంగా కొండమీదరాయుడి రథోత్సవం
- భక్తజనంతో కిటకిటలాడిన బుక్కరాయసముద్రం
- ప్రతిధ్వనించిన గోవింద నామం



పూర్ణాహుతి సమర్పిస్తున్న వేద పండితులు

అలంకరణలో ఆంజనేయస్వామి

స్వామి, అమ్మవార్లు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణతో బుక్కరాయసముద్రం ప్రతిధ్వనించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా కొండమీద రాయుడి రథోత్సవం బుధవారం అశేష జనవాహిని నడుమ కన్నుల పండువగా సాగింది. దేవదేవుడి వైభవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉభయ దేవేరులతో సూర్య తేజ వాహనంపై ఆసీనులైన స్వామి వారు భక్తుల విశేష పూజలు అందుకున్నారు. మహా రథోత్సవాన్ని తిలకించడానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలు, కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అంతకుముందు స్థానిక లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో భూదేవి, శ్రీదేవి అమ్మవార్లకు స్వామి వారితో కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం సూర్య ప్రభ వాహనంపై స్వామివారిని కొలువు తీర్చి పల్లకీసేవలో దివ్యరథం వద్దకు చేర్చారు. రథోత్సవం వద్ద వేద పండితులు హోమం



ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామి ప్రతిమను ఉత్సవ రథంపై ప్రతిష్ఠించారు. స్వామివారి దివ్య రథానికి ఎమ్మెల్యే బండారుశ్రావణీశ్రీ గుమ్మడికాయతో దిష్టి తీశారు. ఉదయం 11:38 నిమిషాలకు భక్తులు మడుగుతేరును స్థానిక అంజనేయ స్వామి దేవాలయం వద్దకు లాగారు. సాయంత్రం 4గంటలకు అక్కడి నుంచి బ్రాహ్మణ వీధి వరకు లాగి యథాస్థానానికి చేర్చారు. దీంతో బ్రహ్మోత్సవాల ప్రధాన ఘట్టం ముగిసింది.

### కిటకిటలాడిన దేవరకొండ

రథోత్సవం సందర్భంగా స్వామి పుట్టుశిల అయిన దేవరకొండ ప్రాంతం భక్తులతో కిటకిటలాడింది. ప్రస్తుతం రోడ్డు వేయడంతో దేవరకొండపైకి వాహనాలు సాయంతో వేలాది మంది భక్తులు వెళ్లి దర్శించుకున్నారు. పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసులు గట్టి భద్రతా చర్యలు తీసుకున్నారు.



మిద్దెలెక్కి.. దర్శనం

రథాన్ని లాగుతున్న భక్తులు



# ఘనంగా రంగనాథుడి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

గుత్తి రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి కల్యాణం, రథోత్సవం బుధవారం ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున శ్రీదేవి, భూదేవితో రంగనాథస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం రుద్రాపారాయణం హోమాలు, మహామంగళ హారతులిచ్చారు. ఆలయంలో స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం చేసి వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామి వారి రథాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, శ్రీదేవి, భూదేవి సమేత బొలికొండ రంగనాథస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. సాయంత్రం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం టెంకాయ కొట్టి రథాన్ని లాగారు. భక్తులు రథంపైకి అరటి పండ్లు బెల్లం తీపి బెండ్లను విసిరి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రామాంజినేయులు, ఆలయ కమిటీ ఛైర్మన్ రంగస్వామి రెడ్డి యాదవ్, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. కాగా రథోత్సవం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక అలంకరణతో వచ్చిన ఎద్దుల బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పెళ్లి పీటలపై స్వామి, అమ్మవార్లు



స్వామివారి పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

# ఊరంతా ఖాళీ

కొనసాగిన తలారిచెరువు ప్రజల ఆచారం



నిర్మానుష్యంగా గ్రామ ప్రధాన వీధి

తాడిపత్రి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలారిచెరువు గ్రామం బుధవారం మాఘపౌర్ణమి పురస్కరించుకొని ఊరంతా ఖాళీ అయింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి పిల్లలు, పెద్దలు అంతా గ్రామాన్ని విడిచిపెట్టి సమీపంలోని హాజీవలి దర్గాకు చేరుకొని అక్కడే నిద్రించారు. అనంతరం ఉదయం అక్కడే వంటలు వండుకొని ఆరగించారు. ఆటపాటలతో సరదాగా గడిపారు. పాడిపశువులను కూడా తోలుకెళ్లారు. కొందరైతే బంధువుల ఊర్లకు వెళ్లారు. తర్వాత రాత్రి సమయంలో కూడా అక్కడే వంట చేసుకొని తిని అనంతరం ఇళ్లకు చేరుకున్నారు. కానీ ఇంటిలోకి వెళ్లినా అర్ధరాత్రి వరకు లైట్లు వేయడం గానీ, ఇంటిని శుభ్రం చేయడం కానీ చేయరు. అర్ధరాత్రి తర్వాత లైట్లు వేసి ఇంటిని శుభ్రపరుస్తారు. అనంతరం స్నానాలు చేసి ఇంటిలో ప్రత్యేక పూజలు చేస్తారు. సుమారు 450 ఏళ్ల క్రితం బ్రహ్మహత్యాపాతకంతో ఊరికి శాపం ఉండేదని, అది పోవాలంటే ప్రతి మాఘ పౌర్ణమినాడు గ్రామస్థులంతా ఊరు ఖాళీచేసి వెళ్లి దక్షిణదిశలో ఒక వంక ప్రాంతంలోకి వెళ్లి నిద్రించాలని సాధువు చెప్పారని, అప్పటి నుంచి ఇలా చేస్తున్నామని గ్రామపెద్దలు తెలిపారు.

# అంతా నా ఇష్టం..!

వెనక్కు తగ్గని బీసీ సంక్షేమ శాఖ అధికారి

- విచారణ అధికారి ఎదుట నోరు విప్పొద్దని హుకుం
- ఆ వార్డెన్లకు సుదూరపు బాధ్యతల తొలగింపు
- కలెక్టర్ అనుమతి లేకుండా ఇతరులకు బాధ్యతలు

6

## నాసిరకం భోజనంపై ఆగ్రహం

సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల ధర్నా (వివరాలు 6లో..)

## గుత్తి ఆర్ఎస్‌లో సైకో వీరంగం

- దేహశుద్ధి చేసిన స్థానికులు

7

## సమస్య లేకుండా కందులు కొనండి

కలెక్టరు వినోద్‌కుమార్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా కనీస మద్దతు ధరతో కందులు కొనుగోలు చేయాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ ఆదేశించారు. సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన వ్యవసాయం వాటి అనుబంధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ ఇప్పటివరకు కందిమాత్రమే కొనుగోలు చేస్తున్నామని, వీటితో పాటు పప్పుశనగ, వేరుశనగ, జొన్న పంట ల కొనుగోలుకు రాష్ట్రశాఖ నుంచి అనుమతులు తీసుకోవాలని ఆదేశించారు. అనుమతి వచ్చిన తర్వాత కనీస మద్దతు ధరలతో ఆ పంటలను కొనుగోలు చేయాలని సూచించారు. భూసార పరీక్షలు చేసి వాటి ఫలితాలను రైతులకు అందజేసి అవసరమైన ఎరువులు వాడేలా అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కౌలు రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహ కాలు అందేలా చూడాలని సూచించారు. ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. రాయితీపై ఇచ్చే బిందు సేద్యపరికరాలను ఇంకా ఎక్కువ విస్తీర్ణానికి అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతహార్టికల్చర్ కాంక్లేవ్ కార్యక్రమం లో ఎంఓయూలు కుదుర్చుకున్న కంపెనీలతో మాట్లాడి వారికార్యక్రమాలు అమలయ్యేలా చూడాలన్నారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా కలిసి ప్రతి రైతును రిజిస్ట్రేషన్ చేసి వారికి ప్రత్యేక సంఖ్యను కేటాయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, ఫిషరీస్ డీడీ శ్రీనివాసనాయక్, డీసీఓ అరుణకుమారి, మార్క్‌ఫెడ్ ఏడీ పెన్నేశ్వరి, సెరికల్చర్, ఆత్మ, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఉద్యోగోన్నతి కోసం నిరీక్షణ

- ఐదేళ్లుగా వార్డెన్ల ఎదురుచూపు
- ఒకరి వల్ల పది మందికి ఇబ్బందులు
- ఎస్సీ సంక్షేమశాఖలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

7

# చెప్పినట్లు చెయ్..!

## లేకుంటే నీ కథ చూస్తాం

- డీఈఓకు పదే పదే బెదిరింపులు
- మద్దతుగా నిలిచినవారికీ వార్నింగ్‌లు
- సంఘాల పేరిట విద్యాశాఖలో పెత్తనం
- తెరవెనుక ఇద్దరు ఎంఈఓలు..?
- కలెక్టర్, ఎస్పీ జోక్యానికి బాధితుల వినతి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో కుల సంఘాల పేరిట కొందరు బెదిరింపులకు దిగుతున్నారు. సొంత శాఖ ఉన్నతాధికారులను టార్గెట్ చేసేందుకు కొందరు ఎంఈఓలు ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. హక్కులను కాపాడేందుకు ఉపయోగపడాల్సిన సంఘాలను కొందరు సొంత ప్రయోజనాలకు వాడుతున్నారు. 'మేం చెప్పినవారికి పోస్టింగ్ ఇవ్వాలి. లేదంటే నీ కథ చూస్తాం. ప్రెస్‌మీట్లు పెడుతాం. ధర్నాలకు దిగుతాం. మీ బండారం బయట పెడతాం..' అని బెదరగొడుతున్నారు. అయినా వినకపోతే.. 'మా కులం గురించి నీచంగా మాట్లాడావు కదా..?' అని లేనిది ఉన్నట్లు పుకార్లు పుట్టిస్తున్నారు. వీరి దెబ్బకు జిల్లాస్థాయి ఉన్నతాధికారులే హడలిపోతున్నారు. తాజాగా డీఈఓ ప్రసాద్ బాబును కొందరు టార్గెట్ చేశారు. ఆయనకు మద్దతుగా నిలిచిన విద్యాశాఖ నాయకుడిని బెదిరించారు. డీఈఓ పరిస్థితే ఇలా ఉంటే.. ఇక దిగువస్థాయిలోని తమ గతేమిటని విద్యాశాఖ అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



### రెచ్చగొట్టి.. ఉసిగొల్పి..

జిల్లా విద్యాశాఖలో కొంతకాలంలో కుల సంఘాల పేరుతో కొందరు హల్‌చల్ చేస్తున్నారు. కుల సంఘాలవారిని విద్యాశాఖలోని కొందరు అధికారులే రెచ్చగొట్టి.. ఉన్నతాధికారులపైకి ఉసిగొలుపుతున్నారు. వ్యక్తిగత పనుల కోసం, కావాల్సిన స్థానాలు, పోస్టుల కోసం అడ్డదారుల్లో వెళుతున్నారు. కొంత కాలంగా డీఈఓను టార్గెట్ చేసి సామాజిక మాధ్యమాల్లో విమర్శలు చేస్తున్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి దూషిస్తున్నారు. కార్యాలయానికి వచ్చి బెదిరింపులకు దిగుస్తున్నారు. గిల్డ్ ఆఫ్ సర్వీసు స్కూల్‌లో ఉన్న డీఈఓ కార్యాలయం వద్దకు ఇటీవల ఓ సంఘం నాయకుడు మద్యం సేవించి వచ్చాడు. 'మా వాళ్ల పని ఎందుకు చేయవు?' అంటూ బెదిరింపులకు దిగాడు. ఆ తర్వాత కొందరు సంఘాల నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి దబాయించారు. ఈ నెల 11న మరికొందరు మరో సంఘం పేరుతో కమలానగర్‌లోని పాత డీఈఓ కార్యాలయంలో ఉన్న డీఈఓను ఉమ్మడి జిల్లా విద్యాశాఖాధికారుల ఎదుటే కించపరిచేలా హెచ్చరించి వెళ్లారు. ఈ రెండు సంఘటనలు అధికారుల ఎదుట జరిగినవే. ఇలాంటివి తరచూ జరుగుతూనే ఉన్నాయి.

### అంతుచూస్తారట...

డీఈఓకు ఎదురైతున్న బెదిరింపులు, వేధింపులను చూసిన విద్యాశాఖ అధికారులు ఆయనకు మద్దతుగా నిలిచారు. ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు మంగళవారం ఉదయం నిరసన తెలిపారు. కలెక్టర్, ఎస్పీని కలిసి తమ సమస్యలు చెప్పుకుంటామని ఆ సంఘం నాయకులు ప్రకటించారు. అదే రోజు రాత్రికి వారికి బెదిరింపులు వెళ్లాయి. 'డీఈఓకు మద్దతుగా నిలుస్తావా..? నీ కథ చూస్తాం.. నీ చరిత్ర తవ్వుతాం' అని కొందరు కుల, ఉద్యోగ సంఘాల నేతలు ఫోన్ చేసి వార్నింగ్ ఇచ్చారు. మొన్న డీఈఓ, ఈ రోజు విద్యాశాఖ యూనియన్ నేత, రేపు మరెవరో..? విద్యాశాఖలో ఈ బెదిరింపుల వ్యవహారం అందరినీ వణుకు పుట్టిస్తోంది.


### ఆ ఇద్దరు ఎంఈఓలేనా..?

విద్యాశాఖ ఉన్నతాధికారులను రోజుకొక కుల సంఘం నాయకుడు, సంబంధం లేని వ్యక్తులు బెదిరించడం వెనుక ఇద్దరు ఎంఈఓలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కులం, ఉద్యోగాల పేరుతో సంఘాలు పెట్టుకుని, వ్యక్తిగత స్వార్థానికి వాడుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తమ వాళ్లకు పోస్టులు ఇప్పించుకునేందుకు ఇద్దరు ఎంఈఓలు కుల సంఘాల నాయకులతో ప్రెస్‌మీట్లు పెట్టించి, సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టిస్తున్నారని అంటున్నారు. మద్యం తాపించి ఉసిగొల్పుతున్నారని విద్యాశాఖ వర్గాల్లో చర్చనడుస్తోంది. విద్యాశాఖలో పనిచేస్తున్నవారే.. సొంతశాఖ ఉన్నతాధికారులను టార్గెట్ చేయడం కలకలం రేపుతోంది. ఉద్యోగులు, అధికారులు స్వేచ్ఛగా పనిచేయలేని పరిస్థితులు వస్తున్నాయి. కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని.. తమకు భద్రత, భరోసా ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.

### పెదవి విప్పని ఉపాధ్యాయ సంఘాలు

నిత్యం సమస్యలపై స్పందించే ఉపాధ్యాయ సంఘాల నేతలు.. బెదిరింపుల వ్యవహారంపై మౌనంగా ఉంటున్నారు. డీఈఓను, విద్యాశాఖలోని ఇతర అధికారులను బయటివారు వచ్చి బెదిరిస్తున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఏ ఒక్క ఉపాధ్యాయ సంఘం నాయకుడూ పెదవి విప్పడం లేదు. ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్లు సైతం మౌనంగానే ఉంటున్నారు.





జ్యోతి దర్శనం చేసుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్‌లో స్వామివారు)

# అఖండ భక్తి జ్యోతి

## కొండమీదరాయుడి సన్నిధిలో.. తొలిసారి

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం సమీపాన కొండమీదరాయుడు వెలసిన దేవరకొండపైన తొలిసారి అఖండ జ్యోతిని వెలిగించారు. స్వామి రథోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ అధ్వర్యంలో దాదాపు 300 కేజీల ఆవు నెయ్యిని వినియోగించి అఖండ దీపాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం 6:45 నిమిషాలకు అఖండజ్యోతిని వెలిగించారు. దాదాపు 1300 మీటర్ల ఎత్తు ఉన్న కొండపై ఏర్పాటు చేయడంతో చుట్టూ 30 కి.మీ. పరిధిలో ప్రజలకు జ్యోతి కనిపించింది. ఇకపై ఏటా కొండమీదరాయుడు రథోత్సవం రోజున భక్తులకు అఖండ జ్యోతి దర్శనం కల్పిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, బుక్కరాయసముద్రం





పున్నమి చందురుడికి అఖండ జ్యోతి హారతులు

# నాసిరకం భోజనంపై ఆగ్రహం

- హాస్టల్ మెస్ చార్జీలు తగ్గించాలని డిమాండ్
- సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల ధర్నా



వీసీ చాంబర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు



ఏబీవీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నాసిరకం భోజనం పెడుతున్నారని సెంట్రల్ యూనివర్సిటీ హాస్టల్ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉడికీఉడకని ఆహారం పెడుతున్నారని, దీని వల్ల అనారోగ్యంబారిన పడుతున్నామని బుధవారం జంతులూరు గ్రామం వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థులతో పాటు ఏబీవీపీ నాయకులు ఆందోళనకు దిగారు. సెంట్రల్ యూనివర్సిటీలో 750 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. హాస్టల్లో నాసిరకం భోజనం పెడుతుండడంతో వైస్ చాన్సలర్ చాంబర్ ఎదుట అందోళనకు దిగారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యార్థులు నిరసన కొనసాగించారు. అన్నం ఉడకడం లేదని, పురుగులతో కూడిన కూరలు పెడుతున్నారని మండిపడ్డారు. రోజుకు రూ.105 చొప్పున మెస్‌కు చెల్లిస్తున్నామని అన్నారు. ఇంత డబ్బు తీసుకుని నాసిరకం భోజనం పెడుతుండడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని విద్యార్థులు వాపోయారు. ఇతర కేంద్రీయ విశ్వవిద్యాలయాల కంటే ఇక్కడ మెస్‌చార్జీలు ఎక్కువగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఉదయం విద్యార్థులకు పెట్టిన ఇడ్లీలు ఉడకలేదని బహిష్కరించారు. సెమిస్టర్ ఫీజులు కూడా తగ్గించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో మెరుగైన ఇంటర్‌నెట్, వేడి నీరు, 24 గంటల నీటి వసతి, నిరంతరంమైన విద్యుత్ తదితర మౌళిక సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. డీన్ రామిరెడ్డి వచ్చి విద్యార్థులతో మాట్లాడారు. వారి డిమాండ్లను వీసీతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

# బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేశామని బుధవారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్‌నాయుడు తెలిపారు. డిసెంబరులో ప్రథమ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని అన్నారు. నాల్గవ సంవత్సరం విద్యార్థులకు ప్రథమ సెమిస్టర్ (ఆర్15,19), తృతీయ సెమిస్టర్ (ఆర్15,19,20) సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు ఫలితాలకోసం జేఎన్టీయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో సీఈ శివకుమార్, ఏసీలు రాజేశేఖర్, అంకారావు, శ్రీధర్ పాల్గొన్నారు.

# ధ్రువపత్రాల జారీలో అవకతవకలు

## ఎముకల వైద్యుడిపై విచారణ



శ్రీకాంత్‌రెడ్డిని విచారిస్తున్న ఉన్నతాధికారులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): సదరం సర్టిఫికెట్ల మంజూరులో అవకతవకలు జరిగాయనే ఫిర్యాదుపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు బుధవారం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చారు. అమరావతి నుంచి వచ్చిన సివిల్ సర్జన్ ప్రోగ్రాం ఆఫీసర్ నాగలక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎముకల వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న శ్రీకాంత్‌రెడ్డిపై వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు ఫిర్యాదులు వచ్చాయన్నారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఇటీవల సదరం క్యాంపునకు వచ్చిన వారిలో కొంత మందితో డబ్బు వసూలు చేసి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఓ మహిళ ఇటీవల హిందూపురంలో సదరం క్యాంపునకు వచ్చినట్లు సమాచారం. ఆర్థో డాక్టర్ డబ్బు డిమాండ్ చేశారని దీనిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రికి, కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై స్పందించిన వైద్యఆరోగ్యశాఖ విచారణకు నాగలక్ష్మితోపాటు బయో మెడికల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమేశ్వరరావును పంపింది.

## ఆస్పత్రి పారిశుధ్య కార్మికుల సమ్మెబాట

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రి, వైద్య కళాశాలలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు అందలేదు. కలెక్టర్, జేసీ, వైద్యాధికారులను కలిసి వినతులు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. చివరకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను కలిసి వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నా మని న్యాయం చేయాలని కోరారు. కానీ కాంట్రాక్టర్ నుంచి వేతనాలు అందలేదు. దీంతో ఆస్పత్రి పారిశుధ్య కార్మికులు జీతం కోసం పోరుబా ట పట్టారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నుంచి సమ్మెకు వెళుతున్నారు. ఇప్పటికే ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావును కలిసి సమ్మెనోటీస్ అందజేశారు. దీంతో గురువారం నుంచి ఆస్పత్రిలో పారిశుధ్య పనులు నిలిచిపోనున్నాయి.

# డ్రిప్.. స్ప్రింక్లర్లు తెచ్చింది చంద్రబాబే

## ఎమ్మెల్యే పరిటాల సునీత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీత

రాప్తాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నీటి వనరులు తక్కువగా ఉన్న జిల్లాలో సీఎం చంద్రబాబు డ్రిప్, స్ప్రింక్లర్లను అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల రైతులకు సబ్సిడీపై మంజూరైన డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను ఆమె బుధవారం పంపిణీ చేశారు. మూడు మండలాలలో 840 మంది రైతులకు పరికరాలు మంజూరు కాగా, రాప్తాడులో 214 మంది రైతులకు రూ.2.60 కోట్ల విలువైన సామగ్రిని ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కరువుతో అల్లాడిపోతున్న జిల్లాకు అప్పట్లోనే సీఎం చంద్రబాబు డ్రిప్, స్ప్రింక్లర్లను తెచ్చారని, వాటిని వినియోగించి రైతులు తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేశారని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పరికరాలను ఇవ్వలేదని, దీంతో రైతులు మార్కెట్‌లో కొని ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఎన్నికల ముందు, వైసీపీ మద్దతుదారులలో కొందరికి పరికరాలను ఇచ్చారని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రాజకీయాలకు అతీతంగా రైతులందరికీ సబ్సిడీపై డ్రిప్, స్ప్రింక్లర్లు అందిస్తున్నామని అన్నారు. అనంతరం మూడు మండలాలలో 129 మందికి పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు పంపిణీ చేశారు. పెరటి కోళ్ల పెంపకం ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందవచ్చని ఎమ్మెల్యే అన్నారు. ఒక యూనిట్ విలువ రూ.6 వేలు కాగా సబ్సిడీపై రూ.3,600 అందించారు.

### ప్రకాష్ రెడ్డి కక్షలు సృష్టిస్తున్నారు..

అధికారంలో ఉన్నప్పుడు గ్రామాలకు రోడ్లు కూడా వేయని ప్రకాష్‌రెడ్డి అధికారం పోయాక గ్రామాల్లో రాజకీయ కక్షలు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.30 కోట్లతో సీసీ రోడ్లు వేశామని, త్వరలో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కనగానపల్లి మండలం గుంతపల్లిలో వ్యక్తిగత కారణాలతో ఇద్దరు గొడవ పడితే అది పరిటాల కుటుంబంపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఆ ఘర్షణలో ఇరువర్గాలవారు గాయపడ్డారని, ఆ మేరకు కేసులు నమోదయ్యాయన్నారు. అందులో పరిటాల కుటుంబం ప్రమేయం లేదని అన్నారు. ప్రకాష్‌రెడ్డి ఇంటి వద్దకు ఎవరూ వెళ్లకపోవడంతో, వైసీపీ శ్రేణులను తన వైపు తిప్పుకునేందుకు పరిటాల కుటుంబాన్ని లాగుతున్నారని విమర్శించారు. ఆయన ట్రాప్‌లో పడితే వైసీపీ శ్రేణులు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రకాష్‌రెడ్డి పద్ధతి మారకపోతే ఆయనపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీ ఎంఐపీ పీడి రఘునాథ రెడ్డి, ఏపీడీ ఫిరోజ్ ఖాన్, ఉద్యాన శాఖ అధికారి రత్నకుమార్, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ విజయలక్ష్మి, మండల కన్వీనర్లు కొండప్ప, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, రఘు, మాజీ ఎంపీటీసీ సాయినాథ్‌నాయుడు, సర్పంచ్‌లు తిరుపాలు, శీనయ్య, ఉజ్జినప్ప, ఎంపీటీసీలు జాఫర్, రవి, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రైళ్లను పునరుద్ధరించాలి

## సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్



డీఆర్ఎంకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తాను సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ కోరారు. డీఆర్ఎం కార్యాలయానికి బుధవారం సీపీఐ నాయకులు వెళ్లారు. కరోనాకు ముందు ఉన్న గుంతకల్లు-బళ్లారి, యశ్వంతపూర్-విజయవాడ ప్యాసింజరు రైళ్లను, హుబ్లీ-విజయవాడ రైలును పునరుద్ధరించాలని కోరారు. యశ్వంతపూర్-టాటానగర్ ఎక్స్‌ప్రెస్‌ను గుంతకల్లు బైపాస్ నుంచి నడుపుతున్నారని, స్టేషన్‌లోకి తీసుకురావాలని కోరారు. విశాఖపట్టణం, గుంతకల్లు రైల్వే డివిజన్లు కోతకు గురైన కారణంగా సౌత్ కోస్టు రైల్వే జోన్‌కు ఆదాయం తగ్గిపోతుందని అన్నారు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 24 బోగీలు నిలిచే స్థాయి ప్లాట్‌ఫారం లేకపోవడం శోచనీయమని, వెంటనే ప్లాట్‌ఫారాల నిడివిని పెంచడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. గుంతకల్లులో రైలు కోచ్ మెయింటెనెన్స్ డిపోను నిర్మించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డీఆర్ఎంకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ నాయకులు గోపీనాథ్, ఎస్ఎండీ గౌస్, రాము రాయల్, దేవేంద్రప్ప కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని కో-ఆర్డినేటర్ జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. బాలుర, బాలికల గురుకులాలకు సంబంధించి మార్చి 6వ తేదీ వరకూ https://apb ragcet.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని అన్నారు. 5వ తరగతి ప్రవేశ పరీక్ష మార్చి 4వ తేదీ ఉదయం 10 గంటలకు, ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష మార్చి 6వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహిస్తామని తెలిపారు.

### ఖాళీల వివరాలు...

అనంతపురం జిల్లా...

| పాఠశాల/కళాశాల | 5వ తరగతి | ఇంటర్మీడియట్ |
|---|---|---|
| కురుగుంట బాలికల గురుకుల కళాశాల/పాఠశాల | 80 | సీఈసీ-80 |
| తిమ్మాపురం బాలికల గురుకుల పాఠశాల/కళాశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| కణేకల్లు బాలుర గురుకుల పాఠశాల/కళాశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| ఉరవకొండ బాలికల పాఠశాల/కళాశాల | 80 | ఎంపీసీ/సీఈసీ-80 |
| బి. పప్పూరు బాలుర పాఠశాల/కళాశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| కురుగుంట బాలికల జూనియర్ కళాశా | -- | ఎంపీసీ/బైపీసీ-160 |
| గుత్తి బాలికల పాఠశాల/కళాశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| బ్రహ్మసముద్రం బాలికల పాఠశాల/కళాశాల | 80 | హెచ్‌ఈసీ/సీఈసీ-80 |
| కొర్రపాడు బాలికల పాఠశాల | 80 | --------------- |
| మొత్తం | 640 | 720 |

| పాఠశాల/కళాశాల | 5వ తరగతి | ఇంటర్మీడియట్ |
|---|---|---|
| సత్యసాయి జిల్లా | | |
| కాళసముద్రం బాలుర కళాశాల/పాఠశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| మలుగూరు బాలుర కళాశాల/పాఠశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| నల్లమాడ బాలికల కళాశాల/పాఠశాల | 80 | హెచ్‌ఈసీ/సీఈసీ-80 |
| అమరాపురం బాలికల కళాశాల/పాఠశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| హిందూపురం బాలికల కళాశాల/పాఠశాల | 80 | ఎంపీసీ/బైపీసీ-80 |
| రొళ్ల బాలుర పాఠశాల | 80 | -------------- |
| హిందూపురం బాలుర పాఠశాల | 80 | --------------- |
| మొత్తం | 560 | 400 |

## బీసీ గురుకులాలలో..

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహాత్మాజ్యోతిభాపూలే బీసీ గురుకులాల్లో 5,6,7,8,9 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ జోనతన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో https://mjpapbcwreig.apcfss.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ నెల 15 నుంచి మార్చి 15వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించామన్నారు. 5వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 27న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. 6,7,8,9 తరగతులకు ఏప్రిల్ 28న, ఇంటర్‌కు ఏప్రిల్ 20న ప్రవేశ పరీక్షలు ఉంటాయన్నారు.

# హాకీ పోటీలకు ఎంపిక



శ్రీనివాసులు

విడపనకల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ జట్టుకు ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపధ్యాయురాలు సర్వ మంగళ తెలిపారు. నవంబరు నెలలో విజయవాడలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో పీడీ శ్రీనివాసులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు ఎంపిక ఆయ్యారని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి 28 వరకూ కాకినాడలో జరిగే ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలలో పాల్గొంటారని అన్నారు. పీడీ శ్రీనివాసులును బుధవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు.

# అంతా నా ఇష్టం..!

## వెనక్కు తగ్గని బీసీ సంక్షేమ శాఖ అధికారి

- విచారణ అధికారి ఎదుట నోరు విప్పొద్దని హుకుం
- ఆ వార్డెన్‌లకు సుదూరపు బాధ్యతల తొలగింపు
- కలెక్టర్ అనుమతి లేకుండా ఇతరులకు బాధ్యతలు

అనంతపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమశాఖ అధికారిగా శ్రీసత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న ఆ అధికారి అంతా తన ఇష్టమన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వార్డెన్లకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. డైట్ బిల్లుల్లో పర్సంటేజీలు తీసుకున్నారు. ఈ అంశాలపై ఆంధ్రజ్యోతిలో 'అదనపు బాధ్యతలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో ఆ శాఖ మంత్రి సవిత, ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ స్పందించారు. ఆ అధికారిపై వచ్చిన ఆరోపణలపై నిగ్గు తేల్చాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆ అధికారి విచారణను చేపట్టకముందే, చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఆ అధికారి తప్పు మీద తప్పులు చేస్తున్నారు. ఒక్కో వార్డెన్‌కు సుదూర ప్రాంతంలో ఉన్న మూడు వసతిగృహాల బాధ్యతలను ఇచ్చారు. ఇది ఆ వార్డెన్‌లకు భారం. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. ఆ శాఖ ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. దీంతో వెంటనే ఆ వార్డెన్లకు సుదూరంలో ఉన్న వసతిగృహాల అదనపు బాధ్యతలు తప్పించాలని జూమ్ మీటింగ్‌లో ఆదేశించారు. ఇంత వరకూ బాగుంది. వార్డెన్లను ఆ బాధ్యతల నుంచి తొలగించేందుకు వెంటనే ఉత్తర్వులు జారీ చేశారు. వసతి గృహాల అదనపు ఇన్‌చార్జ్ బాధ్యతలను సమీపంలోని ఎస్సీ సంక్షేమశాఖ వార్డెన్లకు అప్పగిస్తూ.. జారీ చేసిన ఉత్తర్వుల్లో రెఫరెన్స్ కింద ఆ శాఖ డైరెక్టర్ ఆదేశించారని పేర్కొన్నారేగాని, ఎక్కడా జిల్లా కలెక్టర్‌కు సమాచారం ఇచ్చినట్లుగాని, అనుమతి లభించినట్లుగాని ఉత్తర్వుల్లో పొందుపరచలేదు. ఏ చిరుద్యోగిని తొలగించినా, ఉద్యోగంలోకి తీసుకోవాలన్నా, అదనపు బాధ్యతలను అప్పగించాలన్నా కలెక్టర్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ బీసీ సంక్షేమశాఖలో ఆ అధికారి సొంత నిర్ణయంతో ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించడం ఆ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.




### గుట్టు రట్టు చేస్తే వేటే...

తన అవినీతి, అక్రమాలను ఎవరైనా బయటపెడుతున్నట్లు అనుమానం వస్తే వేటు వేయడానికి ఏమాత్రం వెనుకాడరు. ఆ అధికారి గుట్టు రట్టు చేస్తే వార్డెన్లకు వేటు తప్పదని అంటున్నారు. కదిరి డివిజన్‌లో పనిచేసే ఓ వార్డెన్‌కు అదనంగా అదే డివిజన్‌లో రెండు వసతిగృహాల బాధ్యతలను అప్పగించారు. అదే వార్డెన్ తన వ్యవహారశైలి గురించి ఇతర అధికారుల వద్ద ప్రస్తావిస్తున్నారని అనుమానం రాగానే.. అందుబాటులో లేడనే సాకుతో చార్జ్‌మెమోలు జారీ చేశారు. విజిట్ పేరుతో ఇలా పలుమార్లు చార్జ్‌మెమోలు జారీ చేశారని సమాచారం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సస్పెండ్ చేయించారని అంటున్నారు. ఆ అధికారి తీరుతో విసిగిన వార్డెన్.. మెడికల్ లీవ్‌లో వెళ్లిపోయారు. అదే అదునుగా సస్పెండ్ చేయించారని అంటున్నారు.

### వ్యతిరేకంగా చెప్పొద్దు..

తన అవినీతి, అక్రమాలు, వ్యవహార శైలిపై ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడిన నేపథ్యంలో... ఆ శాఖ మంత్రి సవిత, ఆ శాఖ డైరెక్టర్ మల్లికార్జున సీరియస్ అయ్యారు. విచారణకు ఆదేశించారు. జాయింట్ డైరెక్టర్‌ను విచారణాధికారిగా నియమించారు. విచారణకు జాయింట్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి త్వరలో జిల్లాకు వస్తున్నారు. ఆయన వద్ద తన వ్యతిరేకంగా చెప్పొద్దని తన అనుకూల వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూఓకు హుకుం జారీ చేసినట్లు తెలిసింది. ఆ అధికారికి అనుకూల వార్డెన్లు, ఆ ఏబీసీడబ్ల్యూఓ పనిగట్టుకొని డివిజన్ల వారీగా.. మిగిలిన వార్డెన్లకు హితబోధ చేస్తున్నట్లు సమాచారం.



Proceedings of the District B.C.Welfare [illegible] Officer, Sri Sathya Sai District
Present: [illegible]
Rc.No.A/60/2024 Dt: 11.02.2025

Sub: BCWD – Sri Sathya Sai [illegible] of certain internal alternative arrangements [illegible] on administrative convinience – Orders – Requested – Regarding.

Ref: Oral instructions of the Director, B.C.Welfare, A.P., Vijayawada on FRS attendance, dt: 11.02.2025.

ORDER:

It is informed that, FRS attendance to the hostel boarders is to be fixed with hostel diet bills from February Month. Hence it is not possible for the Hostel Welfare Officer who is holding additional 2 hostel duties to implement the 100% FRS attendance to the hostel boarders on daily basis and for which, for effective and smooth functioning of the hostels, to avoid the situation, it is necessary to make certain alternative arrangements among vacant hostels in Sri Sathya District.

Keeping in view of the circumstances reported vide ref read above, and the position of the HWOs working in the District, the following alternative arrangements are made due to administrative convenience in B.C.Pre Matric Hostels and for effective implementation of FRS attendance and Menu as per Ms. No.8 SW (SW.EDN.2) Dept.dt: 20-02-2023 and to implement the Post Matric Scholarships & Reimbursement of tuition fee.

Therefore, the following Hostel Welfare Officers are hereby kept full additional charge to the posts of vacant Hostel Welfare Officers in Sri Sathya Sai District until further orders.

| Sl. No | Name of the Hostel | Name of the HWO working at present to the vacant Hostel | Name of the HWO proposed to be kept as FAC to the vacant HWO post |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| [illegible] | Govt B.C.Boys Hostel [illegible] | Smt G.Lalithamma | Sri K.[illegible] Naik, HWO (SGT Teacher) Ashram High School, Nallamada |
| 2 | Govt B.C.College Boys Hostel, Bukkapatnam | Sri A.P.Gopal | Sri T.Vijay Kumar, HWO, S.C.Boys Hostel, [illegible] |
| 3 | Govt B.C.Boys Hostel Chilamathur | Sri C.Obula Reddy | Sri S.Chand Basha, HWO, S.C.Boys Hostel, Chilamathur |

జిల్లా కలెక్టర్ నోట్(అనుమతి) ప్రస్తావన లేకుండా వార్డెన్లకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఆ అధికారి విడుదల చేసిన ఉత్తర్వు

క్రైం కార్నర్

## గుత్తి ఆర్‌ఎస్‌లో సైకో వీరంగం

● దేహశుద్ధి చేసిన స్థానికులు



సైకోను తాళ్లతో కట్టేసిన స్థానికులు

గుత్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్‌ఎస్‌లో బుధవారం ఓ సైకో వీరంగం సృష్టించాడు. నడిరోడ్డుపై బట్టలు విప్పి నగ్నంగా తిరుగుతూ దుకాణాలపై రాళ్లు విసురుతూ జనాలను భయభ్రాంతులను చేశాడు. పత్తికొండ రోడ్డు సర్కిల్లో ఓ మటన్‌దుకాణంపై దాడికి పాల్పడేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి కాళ్లు చేతులు కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ సైకోను వాహనంలో తీసుకెళ్లి ఇతర ప్రాంతానికి తరలించారు. దీంతో స్థానిక ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. దాదాపు అరగంటపాటు సైకో వీరంగం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అతడు తిరుపతికి చెందినవ్యక్తి అని సమాచారం.

## వెంటాడిన మృత్యువు



రామాంజనేయులు (ఫైల్)

కుందుర్పి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలిమిపాల్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయ రామాంజనేయులు (53)ను మృత్యువు వెంటాడింది. ఇంటి పైనుంచి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వెంటాడింది. వారం రోజులపాటు పోరాడి చివరకు ప్రాణం విడిచాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బోయ రామాంజనేయులు కూలి పనులకు వెళ్లుండేవాడు. అతడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్ ఉన్నారు. ఈనెల 4వ తేదీన ఇంటి పైకప్పు మీద ఉన్న కోడిపెంటను శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. నడుము వద్ద తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. 5వ తేదీన తెల్లవారుజామున మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు అంబులెన్సులో కర్నూలుకు తరలిస్తుండగా వెల్దుర్తి సమీపంలో టోల్ ప్లాజా వద్ద రోడ్డు సూచికను ఢీకొట్టారు. ప్రమాదంలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్స్ డ్రైవర్‌తోపాటు రామాంజనేయులు భార్య లక్ష్మీదేవి, కుమారుడు అనిల్, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రామాంజనేయులు మంగళవారం మృతిచెందాడు. కర్నూలు జిల్లా కృష్ణగిరి పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

## అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

లేపాక్షి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన రైతు నరసింహమూర్తి(32) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. నరసింహమూర్తి గ్రామంలో వ్యవసాయంతోపాటు కూలిపని చేసుకుంటూ జీవించేవాడు. ఇటీవల ఫైనాన్స్‌లో ద్విచక్ర వాహనం కొనుగోలు చేశాడు. దానికి కంతులు కట్టకపోవడంతో మూడు రోజుల కిందట వాహనాన్ని ఫైనాన్స్ వారు తీసుకెళ్లారు. దీంతో జీవితంపై విరక్తిచెంది బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి దగ్గరలోనే ఉన్న చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు ఉరికి వేళాడుతున్న అతడిని కిందకి దించి పరీక్షించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. భార్య శోభ ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా మృతుడికి దాదాపు రూ.ఐదారు లక్షలు అప్పులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

## నేలకోట తండాలో కూలీ..

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలకోటతండాకు చెందిన వ్యవసాయ కూలీ నాగభూషణనాయక్(50) బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు నాగభూషణనాయక్ వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. రెండురోజుల కిందట భార్య కృష్ణమ్మబాయి తమ కుమార్తె ఇంటికి వెళ్లడంతో మనస్తాపం చెంది పురుగులమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, మృతి చెందినట్లు నిర్ధారించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## ప్రింటింగ్ ప్రెస్ యజమాని..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై.. మనస్తాపంతో ఓ ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ తెలిపిన మేరకు.. నగరంలోని కమలానగర్‌లో చంద్రశేఖర్ (50) భవాని ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. మద్యానికి అలవాటు పడిన చంద్రశేఖర్‌కు కుటుంబ సభ్యులు మానుకోవాలని సూచించేవారు. ఈ క్రమంలో బుధవారం కింద ప్రింటింగ్ ప్రెస్‌లో భార్య, ఇతర కుటుంబసభ్యులు ఉండగా పై గదిలోకి వెళ్లిన చంద్రశేఖర్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బావిలో పడి యువకుడి మృతి

చిలమత్తూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నేన్ పురంలో నాగరాజు (32) ప్రమాదవశాత్తు పాడుబడిన బావిలో పడి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు నాగరాజు కూలి పనులు చేసుకుంటూ ఉండేవాడని, అందులో భాగంగా మంగళవారం కూలి పనికి వెళ్లాడన్నారు. అయితే పనిచేస్తున్న చోట బహిర్భూమికి వెళుతున్నట్లు అక్కడున్న వా రికి చెప్పి వెళ్లాడన్నారు. అయితే అతను ఎంత సేపటికి రాకపోవడంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. అయితే బుధవారం ఉదయం పొలంలో వ్యవసాయ పనులకు వెళ్లిన వారికి పాడుబడిన బావిలో శవమై కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి శివప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

## టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు బుధవారం 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు.



# ఉద్యోగోన్నతి కోసం.. నిరీక్షణ..!



● ఐదేళ్లుగా వార్డెన్ల ఎదురుచూపు

● ఒకరి వల్ల పది మందికి ఇబ్బందులు

● ఎస్సీ సంక్షేమశాఖలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం

అనంతపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏ ప్రభుత్వ శాఖలోనైనా ఉద్యోగికి అంచలంచెలుగా పదోన్నతులు ఉంటాయి. పదోన్నతి ద్వారా హోదా, జీతంతో పాటు ఇతర అలవెన్సులు వల్ల లబ్ధి చేకూరుతుంది. ఎస్సీ సంక్షేమశాఖలో ఉద్యోగోన్నతి విషయంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కలెక్టర్‌కు మొర పెట్టుకున్నా ఆ ఉద్యోగులకు న్యాయం జరగడం లేదు. ఎన్నేళ్లిలా ఉద్యోగోన్నతి కోసం నిరీక్షించాలో బదులిచ్చే నాథుడే కరువయ్యారు. ఎస్సీ సంక్షేమశాఖలో ఉమ్మడి అనంత జిల్లాలో పనిచేస్తున్న 10 మంది వార్డెన్ల ఉద్యోగోన్నతి విషయంలో ఉన్నతాధికారుల తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆ శాఖ నిబంధనల మేరకు వార్డెన్లకు గ్రేడ్-1 వార్డెన్(ఏఎస్‌డబ్ల్యూఓ)గా ఉద్యోగోన్నతి పొందడానికి అర్హులు. ఉద్యోగోన్నతి పొందాలంటే తప్పనిసరిగా బీఈడీ పూర్తి చేసి ఉండాలి. సీనియార్టీ జాబితాలో ఉన్న 10 మంది వార్డెన్లు బీఈడీ పూర్తి చేశారు. అదే శాఖలో పనిచేస్తున్న క్లాస్-4 ప్రమోటెడ్ వార్డెన్ తనకూ గ్రేడ్-1 వార్డెన్‌గా ఉద్యోగోన్నతి కల్పించాలంటూ కోర్టును ఆశ్రయించాడు. అతడు సీనియార్టీ జాబితాలో 30వ స్థానంలో ఉండటంతో పాటు... ఆ శాఖ నిబంధనల మేరకు బీఈడీ అర్హత లేదని ఆ శాఖ అధికారులే స్పష్టం చేస్తున్నారు. అర్హత లేకపోయినా గ్రేడ్-1 ఉద్యోగోన్నతి కల్పించాలని కోర్టుకు వెళ్లిన వార్డెన్‌ను సాకుగా చూపుతూ మిగిలిన వారికి అన్యాయం చేసే విధంగా ఆ శాఖ ఉన్నతాధికారులు వ్యవహరిస్తుండటం విమర్శలకు దారితీస్తోంది.

### ఆ ఇద్దరు అధికారుల వ్యవహారమే శాపమా...?

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 10 మంది వార్డెన్లకు ఉద్యోగోన్నతులు రాకపోవడానికి గతంలో ఆ శాఖ ఉన్నతాధికారులుగా పనిచేసిన ఇద్దరి నిర్వాకమే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆ ఉన్నతాధికారుల వ్యవహారశైలితో 10 మంది వార్డెన్లకు శాపంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన ఆ ఇద్దరు ఉన్నతాధికారులు మహిళా, పురుష ఉద్యోగుల సీనియార్టీ జాబితాను వేర్వేరుగా రూపొందించడంతోనే సమస్య ఉత్పన్నమైందని తెలుస్తోంది. వారిద్దరి ప్రోత్సాహంతోనే ఓ వార్డెన్ కోర్టును ఆశ్రయించారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ ఇద్దరు అధికారుల తీరుపై రాష్ట్రస్థాయి అధికారులు సీరియస్ అయ్యారని సమాచారం. వేర్వేరుగా పదోన్నతుల సీనియార్టీ జాబితాను రూపొందించడంపై విచారణకు ఆదేశించారు. ఆ క్రమంలోనే ఆ రెండు జాబితాలను రద్దు చేశారు. ఇదిలా ఉండగా.. గ్రేడ్-1 వార్డెన్ ఉద్యోగోన్నతి కల్పించాలని కోర్టును ఆశ్రయించిన కేసు విచారణకు వచ్చింది. ఆ సమయంలో ఆ శాఖ రాష్ట్ర అధికారులైనా... జిల్లా ఉన్నతాధికారులైనా పట్టించుకొని కౌంటర్ ఫైలు చేసి ఉంటే... 10 మంది వార్డెన్లకు గ్రేడ్-1 ఉద్యోగోన్నతులు కలిగేవి. ఆ శాఖ రాష్ట్రస్థాయి అధికారులు, జిల్లా అధికారులు ఆ విషయంలో మీనమేషాలు లెక్కించడంతో ఐదేళ్లు గడుస్తున్నా... వారికి కోసం ఎదురుచూపులే మిగిలాయి.

### కలెక్టర్‌కు సర్వాధికారాలున్నా...

ఉద్యోగోన్నతుల విషయంలో జిల్లా కలెక్టర్‌కు సర్వాధికారాలు ఉంటాయి. ఒక్కరి కోసం... 10 మంది వార్డెన్లకు ఉద్యోగోన్నతులు కల్పించే విషయంలో నిర్ణయం తీసుకోలేకపోతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఉద్యోగోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ స్పందనలో కలెక్టర్‌కు పలుమార్లు మొర పెట్టుకున్న సందర్భాలు లేకపోలేదు. లిఖితపూర్వకంగా వినతులు సమర్పించినా.. వారి మొర ఆలకించకపోగా.. జీపీ నివేదిక తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆ శాఖ అధికారులతో కలిసి ఆ 10 మంది వార్డెన్లు జీపీ నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు సమాచారం. గ్రేడ్-1 పదోన్నతులు కల్పించేందుకు ఆ 10 మంది వార్డెన్లు అర్హులని అందులో స్పష్టంగా పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ.. ఉద్యోగోన్నతి కోసం కోర్టుకెళ్లిన ఆ వార్డెన్ కేసు విత్‌డ్రా చేసుకుంటే సమస్య పరిష్కరిస్తామని స్వయంగా కలెక్టరే తేల్చి చెప్పినట్లు బాధిత వార్డెన్ల ద్వారా తెలుస్తోంది. కోర్టుకెళ్లిన ఆ క్లాస్-4 వార్డెన్ మాత్రం కేసు వెనక్కు తీసుకునేది లేదని భీష్మించుకు కూర్చోవడంతో చిక్కుముడి వీడలేదు. ఇక్కడ మరో విషయం తెరపైకి వస్తోంది. ఆ పదిమందిలో వరుసగా సీనియార్టీ జాబితాలో 9 సంఖ్య వరకూ ఉన్న వారికి గ్రేడ్-1 వార్డెన్లుగా పదోన్నతి కల్పించి ఆఖరి వార్డెన్‌కు ఆపడం వల్ల... ఆ 9 మందికైనా న్యాయం జరుగుతుందనే వాదన ఆ వర్గాల నుంచి వినిపిస్తోంది. తర్వాత కోర్టు తీర్పు ఎవరికి అనుకూలంగా వస్తే... ఆ వార్డెన్‌కు ఉద్యోగోన్నతి కల్పించవచ్చని అంటున్నారు. ఇతర జిల్లాల్లో ఇదే పద్ధతిని అనుసరించారని అంటున్నారు. జిల్లాలో ఆ విధానం పాటించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఒకేరోజు రెండు సమావేశాలు వద్దు



డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఒకే రోజు స్కూల్, కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించడం సరికాదని పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు వేర్వేరుగా విద్యాశాఖ అధికారుల తీరును ఖండించారు. విద్యాశాఖ విడుదల చేసిన పాఠశాల కాంప్లెక్స్ సమావేశాల సమయాలను మార్చాలని ఏపీటీఎఫ్ నాయకులు కోరారు. ఆ సంఘం నాయకులు డీఈఓ ప్రసాద్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ప్రధానకార్యదర్శి సిరాజుద్దీన్ మాట్లాడుతూ.. స్కూళ్లలో తరగతులు బోధించి, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి 20 కిలోమీటర్ల నుంచి 25 కిలోమీటర్ల దూరంలోని కాంప్లెక్స్ మీటింగ్స్‌కు హాజరుకావడం అసాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు నరసింహులు, వెంకటమంరణ, సర్దార్‌వలి, చిదంబరరెడ్డి, బాలరామ్మోహన్, సూర్యనారాయణ, ఈశ్వరయ్య, తిప్పేస్వామి,మహేష్ పాల్గొన్నారు.

**పాత పద్ధతిలోనే నిర్వహించాలి: ఎస్టీయూ**

కాంప్లెక్స్ సమావేశాలను పాత పద్ధతిలోనే నిర్వహించాలని ఎస్టీయూ నేతలు డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు బుధవారం ఎస్టీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి మాట్లాడుతూ.. స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహణ సమయాలు మార్పు చేస్తూ విద్యాశాఖ నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. మధ్యాహ్నం స్కూల్ బంద్ చేసిన తర్వాత స్కూళ్ల నుంచి పిల్లలు ఇళ్లకు, టీచర్లు కాంప్లెక్స్ మీటింగ్స్ వెళ్లడం ఇబ్బందికరం అన్నారు. మహిళా టీచర్లు 12 కిలోమీటర్ల నుంచి 20 కిలోమీటర్ల దూరం కాంప్లెక్స్ సమావేశాలకు ఎలా వెళ్తారంటూ ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజనేయులు, నా యకులు సూర్యుడు, చంద్రశేఖర్, శివయ్య ఆచారి, నాగభూషణ, వాణి, కిషోర్, సురేష్‌బాబు, కృష్ణమోహన్, ఫణిభూషణ్ పాల్గొన్నారు.

## చీనీ సీజన్ ప్రారంభం

● మార్కెట్‌కు పెరుగుతున్న దిగుబడులు



మార్కెట్‌కు వచ్చిన చీనీ కాయలు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఆలస్యంగా చీనీ సీజన్ పారంభమైంది. అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని చీనీ మార్కెట్‌కు చీనీ దిగుబడులు కాస్త పెరిగాయి. గత నాలుగైదు రోజుల నుంచి 40 టన్నులకు పైగా కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. మార్కెట్‌కు బుధ వారం 45టన్నుల చీనీ కాయలు వచ్చాయి. టన్ను గరిష్ఠ ధర రూ.21,850, కనిష్ఠ ధర రూ.5వేలు, సరాసరి రూ.11వేలతో అమ్ముడు పోయాయి. చీనీ సీజన్ ప్రారంభం కావడంతో మార్కెట్‌లోని వ్యాపారులు మండీలను ఒక్కొక్కటిగా ప్రారంభిస్తున్నారు. గత వారం రోజుల నుంచి ఈ ప్రక్రియ సాగుతోంది. కాగా ఇప్పటికీ మహారాష్ట్ర, తెలంగాణ తదితర ప్రాంతాల్లో స్థానికంగా చీనీ ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కాయలను మార్కెట్‌కు తెచ్చేందుకు ఉమ్మడి జిల్లా రైతులు వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో మార్కెట్‌కు చీనీ కాయల రాక మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు చెప్పుకొచ్చారు.

## మంటల్లో చిక్కుకుని వృద్ధుడి మృతి

లేపాక్షి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు అంటించిన మంటల్లో చిక్కుకుని వృద్ధుడు మృతిచెందిన సంఘటన లేపాక్షిలో చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. లేపాక్షి ప్రధాన ఆలయం వెనుక పిచ్చి మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగింది. కొంతమంది ఆకతాయిలు బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో పిచ్చిమొక్కలకు అగ్గిపెట్టారు. లేపాక్షి గ్రామానికి చెందిన మాబుసాబ్(87) పొలంవద్ద నుంచి అటుగా వస్తున్నాడు. అతడికి కళ్లు సరిగా కనబడకపోవడంతో మంటల్లో చిక్కుకున్నాడు. అక్కడే పిచ్చిమొక్కలు, గడ్డివాములు ఉండటంతో మంటలు అధికమై అందులో ఇరుక్కుని పూర్తిగా కాలిపోయాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

● వ్యవసాయ అధికారుల సమావేశంలో కలెక్టర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వ్యవసాయ అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం డైరీ, క్యాలెండర్లను జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ మరింత మెరుగైన సేవలు అందించేలా చొరవ చూపాలని సూచించారు. వ్యవసాయ అధికారులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తనను సంప్రదిస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వాసు ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి వెంకటేక్‌కుమార్, కోశాధికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, చిన్నమ్మ, సోమశేఖర్, పెన్నయ్య, ఎల్లప్ప, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

## శతాధిక వృద్ధుడి మృతి



షక్రుసాహెబ్ (ఫైల్)

గుత్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోటవీధిలో నివాసముంటున్న శతాధిక వృద్ధుడు షక్రుసాహెబ్(103) మంగళవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. షక్రుసాహెబ్ వ్యవసాయం సాగుచేస్తుండేవాడు. ఆయనకు కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వసగుడ్డం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వినోద్(30) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు బళ్లారి జిల్లా బండట్టి గ్రామానికి చెందిన వినోద్, ఉమేష్ అనే ఇద్దరు యువకులు రాయదుర్గం వైపు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. రాత్రి 7 గంటల సమయంలో వసగుడ్డం గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటో టైర్ పంచర్ కావడంతో అది అదుపు తప్పి యువకులు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో వారిద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో వినోద్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఉమేష్ స్వల్పంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ గురుప్రసాద్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని, క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

## ఎక్కువ కేసులు పరిష్కారమవ్వాలి

● డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్




మాట్లాడుతున్న డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్‌ఎస్‌ఏ) కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ సూచించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో బీఎస్‌ఎన్‌ఎల్, ఏపీఎస్‌ఆర్టీసీ, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, మున్సిపల్, పంచాయతీ అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ.. మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా ఆయా శాఖల అధికారులు, ఉద్యోగులు చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## రక్తదానంతో ప్రాణదాతలుగా నిలవండి

● ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని ప్రతిఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ పిలుపునిచ్చారు. ఆర్టీసీ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం రీజియన్‌లోని వివిధ డిపోల నుంచి 63 మంది సిబ్బంది హాజరై రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలందరికీ ఆర్‌ఎం ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్, రెడ్‌క్రాస్ వైద్యులు లక్ష్మణ్ ప్రసాద్, శంకర్‌గౌడ్, అనంతపురం డీఎం నాగభూపాల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులతో ఆర్టీసీ చెలగాటం..!

● ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్

● మధ్యలో ఆగిపోతున్న డొక్కు బస్సులు

● ఆందోళన చెందుతున్న విద్యార్థులు



హావళిగిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు

విడపనకల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆలస్యానికి మారుపేరుగా మారిన ఆర్టీసీ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది. ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి. డొక్కు బస్సులు ఎప్పుడు, ఎక్కడ ఆగిపోతాయో తెలియక విద్యార్థులు నిత్యం భయాందోళనలతో ప్రయాణం చేస్తున్నారు. బుధవారం విద్యార్థులు ప్రయాణిస్తున్న బడి బస్సు మధ్యలో ఆగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సు గేర్ రాడ్డు విరిగి పోవటంతో హావళిగి గ్రామంలోని బస్టాండ్‌లో నిలిచిపోయింది. ఉదయాన్నే ఇంటర్ విద్యార్థులకు ఉరవకొండలో ప్రాక్టికల్స్ ఉండటంతో ప్రత్యామ్నాయ బస్సు కోసం ఎదురు చూస్తూ ఆందోళన చెందారు. ఉదయం 8 గంటలకు బస్సు నిలిచి పోవటంతో ఉరవకొండకు చెందిన ఆర్టీసీ డ్రైవర్, డిపోకు ఫోన్ ద్వారా సమాచారం అందించి మరో బస్సును రప్పించారు. దీంతో విద్యార్థులు అర గంట ఆలస్యంగా ప్రాక్టిల్ పరీక్షలకు హాజరయ్యారు.

**కండిషన్ బస్సులు నడపాలి:** ప్రస్తుతం ఇంటర్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలంటే కండిషన్ ఉన్న బస్సులను నడపాలని ఆయా గ్రామాల విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. సమయానికి బస్సులు రాక పోయినా, కండీషన్ లేని బస్సులు మధ్యలో నిలిచిపోయినా విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు పరీక్షా సమయంలో విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

## ఉమానీలకంఠేశ్వర స్వామి గ్రామోత్సవం


రథంపై స్వామిని ఊరేగిస్తున్న భక్తులు

రాప్తాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘమాస పౌర్ణమి సందర్భంగా రాప్తాడులో ఉమా నీలకంఠేశ్వరస్వామి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురుస్వాములు చిట్రా నాగేంద్ర, గౌరవ శివయ్య నేతృత్వంలో బుధవారం రాత్రి స్వామి అమ్మవారి చిత్రపటాలను ప్రత్యేకంగా అలంకరించి రథంపై కొలువు దీర్చారు. స్థానిక నీలకంఠేశ్వరస్వామి ఆలయం వద్ద నుంచి శివభక్తులు శివనామ స్మరణతో పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో శివభక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## బండమీదపల్లి విద్యార్థికి 99.97 పర్సెంటైల్


శెట్టిపల్లి శశిధర్ రెడ్డి

శింగనమల ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సి. బండమీదపల్లికి చెందిన శెట్టిపల్లి శశిధర్‌రెడ్డి జేఈఈ మెయిన్స్ ఫస్ట్ సెషన్స్‌లో 99.97 పర్సెంటైల్ సాధించాడు. మాదాపూర్‌లోని నారాయణ కాలేజీలో శశిధర్ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సి. బండమీదపల్లికి చెందిన శెట్టిపల్లి శశిధర్‌రెడ్డి తండ్రి నరసింహా రెడ్డి వ్యవసాయదారుడు. తల్లి పి. రమణమ్మ ఉపాధ్యాయురాలు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ... జేఈఈ మెయిన్స్‌లో ఆల్ ఇండియా ర్యాంకుల్లో 250లోపు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

## పూర్వ విద్యార్థికి అభినందనలు


విద్యార్థిని అభినందిస్తున్న టీచర్లు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక మినర్వా స్కూల్ పూర్వ విద్యార్థినిని కరస్పాండెంట్, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. జేఈఈ మెయిన్ సెట్ వన్ పరీక్షల్లో ప్రతిభ చూపి 99.48 పర్సంటైల్ సాధించిన విద్యార్థి మహ్మద్‌ను ఆసిఫ్‌ను మినర్వా స్కూల్‌లో బుధవారం ఘనంగా సన్మానించారు. స్కూల్ కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ఇతర టీచర్లు విద్యార్థికి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. తనను గుర్తించి సత్కరించిన కరస్పాండెంట్, ఉపాధ్యాయులకు మహ్మద్ ధన్యవాదాలు తెలిపాడు.

## ఏఐఎస్‌ఎఫ్ నాయకుడి మృతికి సంతాపం

ఆత్మకూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వై కొత్తపల్లికి చెందిన ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు మహేష్(40) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జిల్లా కేంద్రంలో నివాసం ఉండి విద్యార్థులు సమస్యల కోసం అహర్నిశలు పనిచేశారని పలువురు పేర్కొన్నారు. మహేష్ మృతదేహానికి సీపీఐ జిల్లా నాయకులు మల్లికార్జున, వేమయ్య, పి రామక్రిష్ణ, నరేష్, కల్లప్ప తదితరులు పూలమాలలు వేసి నివాళలర్పించారు.

## పోలీసుల అదుపులో పోక్సో కేసు నిందితుడు

గార్లదిన్నె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఓ యువకుడు లైంగిక దాడి చేయడంతో ఓ బాలిక గర్భం దాల్చింది. బాలిక సోమవారం రాత్రి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రిలో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బాలిక కుటుంబ సభ్యులు గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న యువకుడు పరారయ్యాడు. పరారైన అతడిని బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## ఆటో ఢీకొని హోంగార్డుకు గాయాలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): విధులు ముగించుకుని వెళ్తున్న ఓ హోంగార్డుకు ఆటో ఢీ కొని తీవ్రగాయాలయ్యాయి. హోంగార్డు వీరాంజనేయులు బుధవారం డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్తుండగా... పాత క్రిష్ణ థియేటర్ సమీపంలోని సర్కిల్‌లో ఆటో ఢీ కొంది. వీరాంజినేయులు కాలికి తీవ్ర గాయమైంది. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు ఆరా తీస్తున్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యామద్దల గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఓ ఎద్దు బుధవారం మృతిచెందింది. గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే రైతు తన ఎద్దులతో స్థానికంగా వేరుశెనగ విత్తనం వేసేందుకు బాడుగకు వెళ్లాడు. పొలంలో ఉన్న స్టే వైరుకు విద్యుత్ సరఫరా అవుతోంది. విత్తనం వేస్తుండగా ఆ వైరు తగలడంతో ఓ ఎద్దు విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు రూ.80వేలపైగా విలువ చేస్తుందని బాధిత రైతు ఆవేదనవ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం మండల కార్యదర్శి ముత్యాలప్ప కోరారు.

## అవార్డు ప్రదానం



తెలంగాణ గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న సంజీవరెడ్డి

నార్పల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సరస్వతీ విద్యామందిరం కరస్పాండెంట్, ధర్మవరంలోని జీవానంద పాఠశాల డైరెక్టర్ మొరుసు సంజీవరెడ్డికి ప్రతిష్టాత్మక సీఐటీడీ గ్లోబల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రేడ్ ప్రమోషన్ అవార్డు 2025 లభించింది. హైదరాబాద్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు బుధవారం తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా విద్యావేత్తలు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందం ఆయనకు అభినందనలు తెలిపారు.

## నరసింహమూర్తి సేవలు వెలకట్టలేనివి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లలితకళా పరిషత్ మాజీ కార్యదర్శి నరసింహమూర్తి సేవలు వెలకట్టలేనివని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. నరసింహమూర్తి ఆరో వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం పరిషత్ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పరిషత్ ప్రధాన కార్యదర్శి పద్మజ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిషత్ ఉపాధ్యక్షుడు రామగోవింద్‌సాగర్, సంగాల నారాయణ స్వామి, సహాయ కార్యదర్శి శివశంకర్, జేకే రామాంజనేయులు, వెంకట్రామిరెడ్డి, అస్లాం బాషా, కుమార్, లోకేష్ పాల్గొన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న దేవరకొండ


ఉత్సవ విగ్రహాలను రథం వద్దకు తీసుకెళ్తున్న భక్తులు

# కిక్కిరిసిన దేవర కొండ

కొండమీదరాయుడు స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి రథోత్సవం కన్నులపండువగా సాగింది. దేవరకొండ భక్తజన సంద్రంగా మారింది. ఈ సందర్భంగా గాజులు, తినుబండారాలు, బొమ్మలు తదితర దుకాణాలు విరివిగా వెలిశాయి. - బుక్కరాయసముద్రం


చిన్నారుల సందడి


దుకాణాల వద్ద భక్తుల సందడి



గాజులు, బొమ్మలు కొనుగోలు చేస్తున్న మహిళలు

# పకడ్బందీగా కంటి అద్దాలు పంపిణీ చేయండి

● కలెక్టర్ వినోద్‌కుమార్

గార్లదిన్నె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఈనెల 14న చేపట్టనున్న కంటి అద్దాలు పంపిణీ చేసే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలను అసిస్టెంట్ కలెక్టర్ వినూత్నతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈనెల 14న ఆదర్శ పాఠశాలలో నిర్వహించనున్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంతమంది విద్యార్థులకు కంటి లో పాలున్నాయి? ఎంతమందిని గుర్తించారు? తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, డీఈఓ ప్రసాద్‌బాబు, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఏఓ బాబాపక్రుద్దీన్, ఎంఈఓ తారా చంద్రానాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

## మత సామరస్యంతోనే సమాజ అభ్యున్నతి

● అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మతసామరస్యంతోనే సమాజ అభ్యున్నతి సాధ్యమవుతుందని అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ పేర్కొన్నారు. విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం ఆరో పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా 140వ జయంతి వేడుకలను ఈ నెల 28వ తేదీన నగరంలోని లలిత కళాపరిషత్‌లో నిర్వహించనున్నారు. సంబంధిత పోస్టర్లను బుధవారం స్థానిక అర్బన్‌బ్యాంకులోని తన చాంబర్‌లో చైర్మన్ జేఎల్ మురళీధర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... ఉమర్ ఆలీషాజయంతి సందర్భంగా ఈనెల 28వ తేదీన 'నేటి భారతదేశం- మత సామరస్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లాలోని కవులు, రచయితలు, మేధావులు, విద్యావంతులందరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉమర్ ఆలీషా సాహితీ సమితి ప్రతినిధులు సుంకర రమేష్, విజయసాయి కుమార్, సునీల్, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సంత్ గురు రవిదాస్ జయంతి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సంత్‌గురు రవిదాస్ గొప్ప తాత్వికుడని బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు అడ్వకేట్ హరిప్రసాద్ పేర్కొన్నారు. మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో రవిదాస్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన అడ్వకేట్ హరిప్రసాద్, ఇందీవర్‌లు రవిదాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు రవికిషోర్, రమేష్, మారెప్ప, బాల గంగాధర్, రాజారమేష్, సాకేహరి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: డీటీసీ

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని డీటీసీ వీర్రాజు సూచించారు. నగరంలో డీటీసీ కార్యాలయంలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డీటీసీ మాట్లాడుతూ... రోడ్డు భద్రతా నియమాలపై సంపూర్ణ అవగాహణ పెంచుకుని ఆచరణలో పెట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని కాపాడిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహక బహుమతి అందజేస్తుందన్నారు. అనంతరం పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 67 వాహనాలను వేలం వేశారు. తద్వారా జీఎస్టీతో కలిసి రూ.4.34 లక్షలు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్టీఓ సురేష్‌నాయుడు, ఎంవీఐ సునీత, పరిపాలన అధికారులు కామరాజు, రాకేష్, సిబ్బంది, వేలం పాటకు హాజరైన వ్యక్తులు పాల్గొన్నారు.

## ఉనికి కోసమే ఆరోపణలు: టీడీపీ

కనగానపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవను వైసీపీ నాయకులు రాజకీయం చేయడం తగదని టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య విమర్శించారు. వైసీపీ వారి ఉనికి కోసమే పరిటాల కుటుంబంపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. స్థానిక పరిటాల భవన్‌లో బుధవారం టీడీపీ నాయకుడు నెట్టెం వెంకటేష్ మాట్లాడుతూ.. తూంచెర్లలో బోర్ల చెన్నప్ప, గుంతపల్లి నరసింహులు మధ్య జరిగిన గొడవను మాజీ ఎమ్మెల్యే, ఎంపీ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, గోరంట్ల మాధవ్ రాజకీయం చేయడం తగదన్నారు.

●రాప్తాడు: మండలంలోని పుల్లలరేవు గ్రామంలో గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ శ్రేణులు సర్వే నెంబర్ 103లోని 7.76 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని టీడీపీ మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సాయినాథ్ అన్నారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం వారు మాట్లాడారు. ఆ భూమిలో బోరు వేసి మొక్కలు నాటి.. వాళ్లే నిప్పంటించారని ఆరోపించారు. టీడీపీ నాయకులు నిప్పు పెట్టారని కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అండతో ఆన్‌లైన్‌లో ఎక్కించున్నారన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే ఆ భూమిని పేదల ఇళ్ల స్థలాల కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు.

## యూరియా వ్యవహారమేంటి..?

● వ్యవసాయ శాఖ ఉన్నతాధికారిని ప్రశ్నించిన కలెక్టర్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యూరియా దోపిడీ వ్యవహారం ఏంటని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మను కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రశ్నించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో కలెక్టర్ బుధవారం సమావేశమయ్యారు. ఇదే క్రమంలో యూరియా దోపిడీపై ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనాన్ని ఆయన ప్రస్తావించారు. యూరియా దోపిడీ వ్యవహారం మొత్తంపై సమగ్ర నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే సత్యసాయి జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావును ఆ జిల్లా కలెక్టర్ యూరియాదోపిడీపై సమగ్ర నివేదికలు అందించాలని ఆదేశించినట్లు సమాచారం.

## రీసర్వే సక్రమంగా చేపట్టండి: జేసీ

గార్లదిన్నె, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పైలెట్ రీసర్వేను సక్రమంగా చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ అధికారులకు సూచించారు. మండలపరిధిలోని కల్లూరులో చేపడుతున్న పైలెట్ రీసర్వేని ఆయన బుధవారం పరిశీలించారు. సంబంధిత భూమి రికార్డులను పరిశీలించారు. రైతులు సహకరిస్తున్నారా అని అధికారులను ప్రశ్నించారు. ప్రస్తుతం రైతులు వరి పంట సాగుచేయడం వల్ల సర్వే చేసేందుకు ఇబ్బందిగా ఉందని అధికారులు సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండారు ఈరమ్మ, సర్వేయర్, ఆర్ఐ, వీఆర్‌ఓ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ నాయకుడి జన్మదిన వేడుకలు


పసుపుల శ్రీరామిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ జిల్లా నాయకుడు పసుపుల శ్రీరామిరెడ్డి జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ హజరై ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి టీడీపీ కార్యకర్తలు, పలువురు అధికారులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు.

## కిమ్స్ సవీరాలో కొత్త విధానంలో గుండెకు శస్త్రచికిత్స

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కిమ్స్‌సవీరా ఆస్పత్రిలో సరికొత్తవిదానంలో గుండె శస్త్రచికిత్సలు చేసినట్లు ఆస్పత్రి కార్డియాలజిస్టు డాక్టరు ప్రదీప్‌కృష్ణ తెలిపారు. వివరాలను ఆయన బుధవారం మీడియాకు వివరించారు. గుంతకల్, అనంతపురానికి చెందిన 45 సంవత్సరాల వయసు ఉన్న ఇద్దరు గుండె సమస్యతో చికిత్సకోసం ఆస్పత్రికి వచ్చారు. వారికి వైద్య పరీక్షలు చేయగా ఆ ఇద్దరికి రక్తనాళాలు పూర్తిగా రక్తపు గడ్డలతో పూడుకుపోయినట్లు గుర్తించారు. మామూలు పద్ధతిలో వారికి శస్త్రచికిత్సలు చేయడానికి కుదరలేదు. దీంతో పెనంబ్రా కాట్ ఆర్ఎక్స్ అనే సరికొత్త విధానం ద్వారా చికిత్స చేసినట్లు డాక్టరు ప్రదీప్ తెలిపారు. ఈ విదానం వల్ల ఒకరికి రక్తపు గడ్డలు తొలగిపోయిన తర్వాత స్టంట్ కూడా వేయడానికి అవసరం లేకుండా పోయిందని తెలిపారు. మరొకరికి మాత్రం రక్తం మరకలు తొలగించిన తర్వాత కూడా రక్తనాళాలు 70శాతం బ్లాక్ అయి ఉండడంతో ఆయనకు స్టంట్ వేశామని తెలిపారు. ఇపుడు ఆ ఇద్దరు ఆరోగ్యంగా కోలుకున్నారని డిశ్చార్జ్ చేసి పంపినట్లు డాక్టరు ప్రదీప్ తెలిపారు.

# అలరించిన నృత్య నీరాజనం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భరతముని జయంతిని పురస్కరించుకుని బుధవారం సాయంత్రం కమలానగర్‌లోని శ్రీనృత్య కళానిలయం ప్రాంగణంలో నిర్వహించిన నృత్యనీరాజన ప్రదర్శన వీక్షకులను ఎంతగానో అలరించింది. తొలుత భరతముని చిత్రపటానికి పూలమాలలు సమర్పించారు. అనంతరం నిర్వహించిన నృత్యప్రదర్శనల్లో శాస్త్రీయ సంగీతానికి సంప్రదాయ నృత్యాలతో కళాకారులు అలరించారు. ప్రదర్శనానంతరం కళాకారులకు సంస్కార భారతి సంస్థ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో శ్రీనృత్యకళా నిలయం నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, ఎస్కేయూ విశ్రాంత రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, సంస్కార భారతి ప్రతినిధి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కళాకారిణుల నృత్య భంగిమ

## వైభవంగా మాఘ పౌర్ణమి పూజలు


అశోక్‌నగర్ సత్యనారాయణస్వామి ఆలయంలో వ్రతం ఆచరిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం నగరంలోని పలు ఆలయాల్లో పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. అశోక్‌నగర్‌లోని రమాసమేత సత్యనారాయణస్వామి దేవాలయం, మూడోరోడ్డు షిర్డీ సాయిబాబా ఆలయం, మల్లేశ్వరరోడ్డులోని లక్ష్మీ గణపతి మందిరాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతం ఆచరించారు. అలాగే హెచ్చెల్సీ కాలనీ మంజునాథస్వామి దేవాలయంలో అనంత ఐశ్వర్యేశ్వర వ్రతాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

## పీఏబీఆర్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

కూడేరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పీఏబీఆర్ డ్యాంను ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. నీటి నిల్వతోపాటు వస్తున్న నీటి గురించి స్థానిక ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే పంపులను, ముద్దలాపురం గ్రామ సమీపంలోని నీటిశుద్ధి కేంద్రాన్ని, అందులో నూతనంగా నిర్మించిన 60 ఎంఎల్‌డీ అదనపు ప్లాంట్‌ను పరిశీలించారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. వేసవిలో నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతపురం పట్టణానికి పీఏబీఆర్ డ్యాం నుంచి ఒక టీఎంసీల నీరు తాగునీటికి కేటాయించారని చెప్పారు. ఆయన వెంట నగర కమిషనర్ బాలస్వామి, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు రాధాకృష్ణ, నరసింహులు పాల్గొన్నారు.

## కుక్కల నియంత్రణ పేరుతో అవినీతి

● చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే దగ్గుపాటి


వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో కుక్కల నియంత్రణ పేరుతో జరిగిన అవినీతిపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ స్పష్టం చేశారు. స్థానిక 17వ డివిజన్‌లో బుధవారం మీ ఇంటికి-మీ ఎమెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి సమస్యలపై ఆరా తీశారు. గత ఐదేళ్లలో చిన్న పని కూడా చేయ కుండా ప్రజలను ఇబ్బంది పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. నగరంలో కుక్కల సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. నగర పరిధిలో జాతీయ రహదారి పనులు సరిగా చేయలేదని, ఎక్కడ చూసినా వంకర, టింకరగా కనిపిస్తోందన్నారు. త్వరలో పరిష్కారం చూపుతామన్నారు. నాయకులు మణికంఠబాబు, సికిందర్, వేణు, నాగరాజు, సాయి ఈశ్వరి, సరిపూటి రమణ, రాజారావు, పోతుల లక్ష్మీనరసింహులు, కడియాల కొండన్న, పరమేశ్వరన్, పీఎల్ఎన్ మూర్తి, రాయల్ మురళి, లక్ష్మీనరసింహ, గోపాల్ గౌడ్, వెంకటేశ్వరరెడ్డి, సైపుద్దీన్, ఇస్మాయిల్, కృష్ణకుమార్, ముక్తియార్, రాంబాబు పాల్గొన్నారు.

## పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు తగదు: అనంత

అనంతపురం క్రైం, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గింపు తగదని వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంతవెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసీపీ నేతలు మాట్లాడారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై వైసీపీ పోరుబాట కొనసాగిస్తుందన్నారు. వైసీపీ నేతలు, కార్యకర్తలపై వేధింపులు తీవ్రమయ్యాయన్నారు. మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మాట్లాడుతూ... హామీల అమలుకు పవన్‌కళ్యాణ్ ఎందుకు బాధ్యత తీసుకోరని ప్రశ్నించారు. ప్రజల నమ్మకాన్ని కూటమి వమ్ము చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీరంగయ్య, ఆలూరు సాంబశివారెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రస్తా కోసం పంట ధ్వంసం

● వైసీపీ కార్యకర్తలపై బాధిత రైతు ఫిర్యాదు


బీర తోటను ధ్వంసం చేసిన దృశ్యం

నార్పల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగనపల్లిలో రస్తా విషయంలో రైతు పత్తిపాటి రామాంజనేయులుకు చెందిన బీర తోటను కొంతమంది వైసీపీకి చెందిన వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేసినట్లు కేసు నమోదైనట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. రైతు పత్తిపాటి రామాంజనేయులుకు చెందిన 15ఎకరాల్లో సాగుచేసిన బీర పంటను వైసీపీకి చెందిన మోహన్, శ్రీనివాసులు, చెన్నకేశవులు, వెంకటస్వామిబాబుతో మరో పది మంది కలసి చేతుల్లో వేటకొడవళ్లతో వచ్చి దౌర్జన్యపూరితంగా పంటను ధ్వంసం చేశారన్నారు. అయితే వారికి ఎలాంటి హక్కు లేనప్పటికి రస్తా వదలాలని చెప్పి పచ్చని పొలాన్ని ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసి డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశారు. దీంతో రూ.10లక్షలు నష్టం వాటిల్లిందని బాధితరైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సంఘటనపై బాధిత రైతు నార్పల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశావని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని తెలిపారు.

## కరాటేలో పీవీకేకే విద్యార్థికి వెండి పతకం


విద్యార్థిని అభినందిస్తున్న పల్లె కిశోర్

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో అండర్-21 విభాగంలో స్థానిక పీవీకేకే కళాశాలకు చెందిన కరణం శుహృత సింహాకు వెండిపతకం దక్కింది. ఆ విద్యార్థిని బుధవారం విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్ కళాశాలలో అభినందించారు. ఈనెల 9న విజయవాడ వారియర్స్ షోతోకన్ అసోసియేషన్, కరాటే ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగినట్లు ఆయన తెలిపారు. ఇందులో కళాశాల విద్యార్థికి వెండి పతకం దక్కడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో విద్యార్థి ఉన్నతికి ఎలాంటి సహాయ సహకారాలైనా కళాశాల నుంచి అందిస్తామన్నారు. కార్యక్రమంలో హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి లక్ష్మీనరసప్ప, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా శ్రీరాముడి రథోత్సవం

● రథాన్ని లాగిన ఎమ్మెల్యే అమిలినేని ● పాల్గొన్న అశేష భక్తజనం


రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం


రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పట్టాభిరాముడి రథోత్సవం బుధవారం కన్నులపండువగా జరిగింది. తొలుత అర్చకులు స్థానిక ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం గ్రంథాలయం వద్ద ఉన్న రథంలో ఉత్సవ విగ్రహాలను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆలయ కమిటీ చైర్మన్ దేవినేని అవినాష్ కొలువుదీర్చి భక్తులతో కలిసి రథాన్ని ముందుకు లా గారు. అశేష భక్తజనం పాల్గొని అరటిపండ్లను రథంపైకి విసిరి మొక్కులను తీర్చుకున్నారు. రథోత్సవంలో గొరవయ్యలు, ఉరుముల కళాకారులు సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

### ఘనంగా బాలాంజనేయస్వామి రథోత్సవం

గుమ్మఘట్ట: మండలంలోని బీటీపీ గ్రామంలో బుధవారం సాయంత్రం బాలాంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఉదయమే అర్చకులు ఆలయంలో మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని రథంలో ఉంచి పురవీధుల్లో ఊరేగించారు. స్థానికులే గాక పలు ప్రాంతాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చి ఉత్సవంలో పాల్గొన్నారు. రథోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన అవధూత పెద్దక్క అమ్మవారు గత వారంరోజులుగా చేస్తున్న ఉపవాసదీక్షను విరమించారు.


అలంకరణలో బాలాంజనేయస్వామి


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

### కమనీయం.. రంగనాథస్వామి కల్యాణం

బెళుగుప్ప: మండలంలోని శ్రీరంగాపురంలో భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేకువజామునే వేదపండితులు ఆలయంలోని మూలవిరాట్‌లకు పలు అభిషేకాలు, అలంకరణలు, ప్రత్యేక పూ జలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి వేదమంత్రోచ్చారణల నడు మ కల్యాణాన్ని జరిపించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో రథోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు

### వైభవంగా విప్రమలై లక్ష్మీనారసింహుడి బ్రహ్మరథోత్సవం


అశేష జనసందోహం మధ్య రథాన్ని లాగుతున్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రాయదుర్గంరూరల్: మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై లక్ష్మీనరసింహస్వామి 29వ బ్రహ్మరథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయమే ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తిస్వామీజీ ఆధ్వర్యంలో వేద పండితులు సుబ్రహ్మణ్యస్వామి, హరిప్రసాద్ ఆలయంలోని స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, నైవేద్యపూజలు నిర్వహించారు. అనంతరం రతంగ హోమం జరిపారు. తర్వాత ఉత్సవ విగ్రహాన్ని రథంలో ఉంచి అశేష భక్తజనం మధ్య పురవీధుల్లో లాగారు. భక్తుల గోవింద నామస్మరణతో వీధులు మార్మోగాయి. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్ ఉత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎన్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారి జీఎం నరసింహులు, ఉప కోశాధికారి సత్యనారాయణ, అకౌంటెంట్ వెంకటేశులు, కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్, ప్రచార కార్యదర్శి కమలాక్షుడు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### కన్నులపండువగా బొబ్బలకుంట ఆంజనేయస్వామి రథోత్సవం

కుందుర్పి: మండలంలోని అపిలేపల్లి గ్రామంలో గుబ్బలకుంట ఆంజనేయస్వామి రథోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు, పూజలు, హోమాలు నిర్వహించారు. తర్వాత రాత్రి 10.30 గంటలకు రథోత్సవాన్ని జరిపారు. స్వామి ఉత్సవవిగ్రహాన్ని, ఆడపడచు, గ్రామదేవత అయిన కుందుర్పమ్మ ఉత్సవ విగ్రహాన్ని రథంలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు బోనాలతో పాల్గొన్నారు. స్థానికులే గాక ఇతర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వచ్చి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. రథంపైకి కొబ్బరికాయలు, అరటిపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. గతేడాది రథోత్సవ వేడుకల్లో రథం లాగుతున్న తరుణంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అంత జనంలోనూ రథం కూలినా.. ఏ ఒక్కరికీ ఎలాంటి ఇబ్బంది జరుగలేదు. ఈ ఘటనతో ఇక్కడ సాక్షాత్తుగా దేవుడున్నాడని భక్తులు ప్రగాఢంగా నమ్ముతున్నారు. ధ్వంసమైన రథంస్థానంలో నూతన రథాన్ని గ్రామస్తులంతా కలిసి తయారు చేయించారు. వేడుకలలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్‌ఐ నగేష్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనం

### పీఏబీఆర్ డ్యాం పరిశీలించిన ఎమ్మెల్యే దగ్గుబాటి

కూడేరు, ఫిబ్రవరి 12:(ఆంధ్రజ్యో తి): మండలంలోని పీఏబీఆర్ డ్యాంను, అనంతపురం అర్బన్ ఎ మ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్ర సాద్ అధికారులతో కలిసి బుధవా రం పరిశీలించారు. ఈ సందర్భం గా డ్యాంలోని నీటి నిల్వతోపాటు వస్తున్న నీటి గురించి స్థానిక ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పట్టణానికి తాగునీటిని సరఫరా చేసే పంపులను పరిశీలించారు. అదేవిధంగా ముద్దలాపురం గ్రామ సమీపంలోని నీటిశుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసి అందులో నూతనంగా నిర్మించిన 60 ఎంఎల్‌డీ అదనపు ప్లాంట్‌ను పరిశీలించారు. తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. వేసవిలో నగర ప్రజలకు తాగు నీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రతలు తీసుకుంటున్నామన్నారు. కూడేరు మం డలం పీఏబీఆర్ డ్యాం నుంచి ఇప్పటివరకు అనంతపురం పట్టణానికి 60 ఎంఎల్‌డీ నీరు సరఫరా అయ్యేవని, జనాభా పెరుగుదల కారణంగా అదనంగా మరో 60 ఎంఎల్‌డీ ప్లాంట్‌ను నిర్మించారని చెప్పారు. అది రెండు నెలలుగా ట్రయల్ రన్ జరుగుతోందని, త్వరలోనే సరిపడా నీరు ప్రతి రోజు సరఫరా అవుతుందని పేర్కొన్నారు. ఆయన వెంట నగర కమిషనర్ బాలస్వామి, ఇంజనీరింగ్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.


పీఏబీఆర్ డ్యాంలోని నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

### గ్రామాల్లో ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి పర్యటన

తాడిపత్రి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపొద్దుటూరు, ఇగుడూరు గ్రామాల్లో ఎమ్మెల్యే జేసీ అశ్మిత్ రెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. గ్రామంలో సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. గ్రామాల ప్రజలు వివిధ సమస్యల్ని ఆయనకు విన్నవించారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని, దీంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాపోయారు. డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఉంటోందని, దీనివల్ల పంటపొలాలకు సరిగా నీరందించలేకపోతున్నామని పలువురు రైతులు తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, అధికారులు ఉన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

### రేపటి నుంచి కేంద్రబడ్జెట్‌పై ఇంటింటి ప్రచారం

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): వామపక్షాల ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ నుంచి కేంద్రబడ్జెట్‌పై పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించనున్నట్లు వామపక్షపార్టీల నాయకులు పేర్కొన్నారు. స్థానిక హంపిరెడ్డి భవనంలో బుధవారం సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్‌న్యూడెమోక్రసీ పార్టీల నాయకుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందన్నారు. పేదలు, కార్మికులకు వ్యతిరేకంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు పనికిరాని బడ్జెట్‌పై క్షేత్రస్థాయిలో వీధివీధిన ప్రజల్లోకి తీసుకెళ్తామని అన్నారు. ఈనెల 14నుంచి 20 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీప్రసాద్, సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నేత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### లక్ష్మీనృసింహాలయానికి రూ. 5 లక్షల విరాళం

గుంతకల్లు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కసాపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బుధవారం 5,00,116 రూపాయల విరాళం చేశారు. ఉదయమే ఆలయంలో మహా సుదర్శన హోమంలో ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం ధర్మకర్త తలారి పరశురాముడుకు నగదును అందజేశారు. తర్వాత కసాపురం ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించి ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కసాపురం ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**మాస్టర్ ప్లాన్‌పై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్**

కసాపురం దేవస్థానానికి సంబంధించిన మాస్టర్ ప్లాన్ విషయంగా ఆశిష్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ అండ్ కన్సల్టెంట్స్ ఇంజనీరింగ్ సంస్థ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చింది. సంస్థ నిర్వాహకుడు రామాంజనేయులు ఆలయ ఆవరణలోని కల్యాణమండపం వద్ద ఉచితంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి దేవాదాయ అధికారులకు వివరించారు. ఇందులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు. ఆలయంలోని స్థలంలో వసతి గదులు, పార్కులు, ఆటవిడుపు ప్రదేశాలు, హోటళ్లు, కొత్తగా నిర్మించాల్సిన కోనేరు, తదితర అంశాలపై ప్లాన్‌ను వివరించారు. ఈ విషయంగా కొందరు అభ్యంతరాలు తెలిపి సవరణలను సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ విషయంగా వాస్తు సూచనలు, అనుభవజ్ఞులు, ధార్మిక సంస్థల సలహాలను పరిగణనలోకి తీసుకుని, కమిషనరేట్ పరిశీలనార్థం పంపుతామని తెలిపారు. దేవాదాయ ఎస్ఈ సతీశ్, ఈఈ కే వాణి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### వెయిటింగ్ హాల్ ప్రారంభం

ఉరవకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌకుంట్ల పీహెచ్‌సీలో వీణ ఎనర్జీ సంస్థ నిర్మించిన వెయిటింగ్ హాల్‌ను టీడీపీ నాయకులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గర్భిణుల సౌకర్యార్థం రూ.6లక్షల వ్యయంతో సంస్థ వారుఈ హాల్‌ను నిర్మించారని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ ఎర్రిస్వామి, టీడీపీ నాయకులు వెంకటనారాయణ వైద్యులు పాల్గొన్నారు.

### మామిడి చెట్లు దగ్ధం

కుందుర్పి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కరిగానపల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతానికి బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో మంటలు చెలరేగి సమీపంలోని ఈడిగ గోపాల్ అనే రైతుకు చెందిన మామిడి తోటకు వ్యాపించాయి. అక్కడ 30 మామిడి చెట్లు, స్టార్టర్ బాక్స్ పూర్తిగా కాలిపోయాయి. రూ. 80 వేలు దాకా నష్టం వాటిల్లినట్లు బాధితరైతు వాపోయాడు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

### బ్యాడిగ మిరప రైతులను ఆదుకోవాలి

కూడేరు, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): బ్యాడిగ మిరప సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ముద్దలాపురం గ్రామంలో బుధవారం రైతు సంఘం నాయకులు పర్యటించి బ్యాడిగ మిరప కాయలను పరిశీలించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా బ్యాడిగ మిరపకు ధర పడిపోవడంతో రైతుల తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రభుత్వమే క్వింటా 50 వేలతో కొనుగోలు చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.లక్ష పరిహారం అందించాలని కోరారు.సంఘం జిల్లా నాయకుడు కృష్ణమూర్తి, మండల కార్యదర్శి కరీం, నాయకులు ఈరన్న, మల్లికార్జున,నారాయణరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

### పొలం పనులు చేస్తూ కుప్పకూలిన రైతు


మోహన్‌రెడ్డి(ఫైల్)

ఉరవకొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లిలో బుధవారం రైతు మోహన్‌రెడ్డి(60) పొలం పనులు చేస్తూ అస్వస్థతకు గురై మృతిచెందాడు. ఆయన పొలంలో మొక్కజొన్న కంకులు ఏరుతుండగా.. ఎండవేడిమికి తీవ్ర అస్వస్థతకు గురై అక్కడే కుప్పకూలిపోయాడు. చుటుప్రక్కల వారు గుర్తించి హుటాహుటిన బైక్‌లో ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రైతు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

### రీ సర్వే పక్కాగా నిర్వహించాలి

పామిడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భూరీ సర్వేను పక్కాగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివనారాయణ్ రెవెన్యూ సిబ్బందికి సూచించారు. మండలంలోని కాళాపురంలో నిర్వహిస్తున్న రీ సర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూముల కొలతలు, రికార్డుల క్రమబద్ధీకరణ పక్కాగా ఉండాలన్నారు. తహసీల్దార్ శ్రీధరమూర్తి, ఆర్‌ఐ విజయ్, సర్వేయర్లు పాల్గొన్నారు.

### భూ రీసర్వే తనిఖీ

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత వారంరోజులుగా రెవెన్యూ అధికారులు చేపట్టిన భూసర్వేను కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ వ్యవసాయ పొలాల్లో రీ సర్వే చేపట్టే సమయంలో ముందస్తుగా ఆ భూమి రైతులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు ఆమోదం మేరకు రీసర్వే పనులు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రఘు, ఆర్‌ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

### ఘనంగా మాఘపౌర్ణమి పూజలు

పెద్దపప్పూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అశ్వత్థ నారాయణ స్వామి, చక్ర భీమలింగేశ్వరస్వామి ఆలయంలో మాఘపౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వార్ల మూలవిరాట్‌లకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అలాగే ఉత్సవమూర్తులను కూడా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో వచ్చి దర్శనం చే సుకుని మొక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు

### వైభవంగా చెన్నరాయస్వామి కల్యాణం

యాడికి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నరాయస్వామి ఆలయం వద్ద శ్రీదేవి, భూదేవి, చెన్నరాయ స్వామివారి కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, రామన్నగుడిసెలు గ్రామపెద్దల కోరిక మేరకు టీటీడీ వారు శ్రీదేవి, భూదేవి, చెన్నరాయ స్వామి ఉత్సవ విగ్రహాలను బహూకరించారు. దీంతో గత ఐదురోజులుగా ఆ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

### 40అడుగుల రోడ్డు తప్పనిసరి: జేసీపీఆర్


వెంచర్ నిర్వాహకులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వెం చర్లు వేయాలంటే స్ట్రైట్ రోడ్డు 40అడుగులు తప్పని సరిగా ఉండాలని ము న్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి వెంచర్ల నిర్వాహకులకు సూచించారు. సీపీ ఐ కాలనీ సమీపంలో ఉన్న మడికయ్యల్లో వేసిన వెంచర్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి నిర్వాహకులతో మాట్లాడుతూ.. ఎలాబడితే అలా వెంచర్లు వేయరాదన్నారు. వెంచర్ వేసే ప్రతి ఒక్కరూ స్ట్రైట్‌రోడ్డు 40అడుగులు, పక్కరోడ్లు 33అడుగులు తప్పనిసరిగా ఉండేటట్లు చూడాలన్నారు. ప్రస్తుతం పోతులయ్యకాలనీ, గన్నెవారిపల్లికాలనీ, సీపీఐ కాలనీల్లో రోడ్లు సరిగా లేక ప్రజలు ఎంత ఇబ్బంది పడుతున్నారో అందరికీ తెలుసునన్నారు. ఇక నుంచి అలాంటి పరిస్థితి తలెత్తరాదన్నారు. రోడ్లు విశాలంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. ఆయన మాటలకు వెంచర్ నిర్వాహకులు అంగీకరించినట్లు తెలుస్తోంది.

### సబ్సిడీ రుణాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

యల్లనూరు, ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరైన సబ్సిడీ రుణాల దరఖాస్తుకు గడువు పొడిగించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి బుధవాం ప్రకటనలో తెలిపారు. ఈ గడువు ఈనెల 15వ తేదీ వరకు పొడిగించడం జరిగిందన్నారు. ఇందుకోసం ఆయా గ్రామాల్లోని మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మేదర, కుమ్మరి, శాలివాహన కులాల వారికి కూడా గ్రూపులోన్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రూపులో ముగ్గురు లేదా నలుగురు సభ్యులుగా ఉండి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని అన్నారు. వివరాల కోసం స్థానిక కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

### రుణాల కోసం దరఖాస్తు చేసుకోండి

కణేకల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాల కొరకు మేదర, కుమ్మరి కులస్తులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు కోరారు. ఒక్కో గ్రూపులో ఐదుగురు సభ్యులు కలిసి రూ. మూడు లక్షలు యూనిట్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఇందులో 50 శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుండగా మరో 50 శాతం బ్యాంకర్లు అందిస్తారన్నారు. అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

## సంక్షిప్త వార్తలు

### రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న జనసేన నాయకులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయ కర్త వాసిగిరి మణికంఠ జన్మనోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గోపీ బ్లడ్ బ్యాంక్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 52మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యుడు పవన్‌శేఖర్, సీనియర్ నాయకులు కసాపురం నంద, పామయ్య, కొనకొండ్లశివ, రామకృష్ణ, అమర్, విజయ్, పరుశురాం, గాజులరఘు, మంజునాథ్, సూరి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

### శ్రీశైలానికి పాదయాత్ర

ఉరవకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ నాయకులు నంద్యాల జిల్లాలోని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి బుధవారం పాదయాత్రగా బయలు దేరారు. శివదీక్షలో ఉన్న నాయకులు శివ, బాబు, వేణుగౌడ్ తదితరులు ఇరుముడి కట్టుకుని పాదయాత్రను ప్రారంభించారు. కేశవ్‌ను మంత్రిగా చూడాలన్న ఆ కాంక్షతో దేవున్ని మొక్కుకున్నామని, ఆ కోరిక నెరవేరడంతో మొక్కు తీర్చడానికి పాదయాత్రగా వెళుతున్నామని వారు తెలిపారు.

### దేవాంగ కల్యాణ మండపం అధ్యక్షుడిగా మల్లేష్

ఉరవకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపం నూతన అధ్యక్షుడిగా కే.మల్లేష్ ఎన్నికయ్యారు. స్థానిక కల్యాణ మండపంలో బుధవారం కులపెద్దలు సమావేశం నిర్వహించారు. గత కొన్ని రోజులుగా వివాదాస్పదమవుతూ వస్తున్న కల్యాణమండపం అధ్యక్షుడి ఎన్నికను ప్రశాంతంగా జరిపారు.

### జేఈఈ మెయిన్స్‌లో సత్తా


వెంకటరాజా నందకిషోర్

గుత్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పొత్తూరు కాలనీలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయులు రఘురామ్ కుమారుడు వెంకటరాజా నందకిషోర్ జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటాడు. గత మంగళవారం వెలువడిన ఫలితాల్లో 99.95 శాతం మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. ఇతను క్రీడల్లోకూడా రాణిస్తున్నాడు. ఇతడి తండ్రి స్థానిక కోట వీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

### కర్ణాటక మద్యం పట్టివేత

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ సీఐ మహేష్‌కుమార్ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. దీంతో గుమ్మఘట్ట మండలం కేపీదొడ్డి గ్రామానికి చెందిన సోమశేఖర్ కర్ణాటక మద్యంను ఉడేగోళం వద్ద రవాణా చేస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. అతడి నుంచి బైక్‌ను, 192 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. దాడుల లో ఎస్‌ఐ పవన్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

### చెరువు కట్టను తవ్వారని ఫిర్యాదు

కళ్యాణదుర్గం రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోరంపల్లిలో చెరువు కట్టను వైసీపీ నాయకుడు తవ్వాడు. చెరువు కట్టకు ఆనుకుని ఆ రైతు భూమి ఉంది. దీంతో తన స్వలాభం కోసం చెరువుకట్టను తవ్వాడని సమీప రైతులు గంగిరెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సంగమేష్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులకు బుధవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు వెంటనే చెరువు కట్ట వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ విషయంపై తహసీల్దార్ భాస్కర్‌ను వివరణ కోరగా ఆ రైతు పొరపాటున తవ్వినట్లు తెలుస్తోందన్నారు. అయినప్పటికీ సదరు వ్యక్తిపై కేసు నమోదు కోసం పోలీసులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు.

### జీతాలు ఇప్పించండి సారూ..

టీడీపీ జిల్లా అధ్యక్షుడికి హమాలీల మొర


వెంకటశివుడు యాదవ్‌తో మాట్లాడుతున్న హమాలీలు

గుత్తి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తమకు జీతాలు ఇప్పించాలంటూ పట్టణంలోని సివిల్ సప్లై గోదాములో హమాలీలు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్‌ను కోరారు. హమాలీలు పట్టణంలోని స్వగృహంలో ఆయన్ను కలిసి మాట్లాడారు. తాము గత కొన్నేళ్లుగా సివిల్ సప్లై గోదాములో హమాలీలుగా పనిచేస్తున్నామన్నారు. గత మూడునెలల నుంచి జీతాలు చెల్లించడంలేదన్నారు. దీంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. తమకు వేతనాలు వచ్చేలా చూడాలని విన్నవించారు. స్పందించిన వెంకటశివుడు యాదవ్ సంబంధింత అధికారితో ఫోన్‌లో మాట్లాడి హమాలీలకు వీలైనంత త్వరగాజీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

### బంగారు గొలుసు చోరీ

యల్లనూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నపూసపల్లిలో గల కృష్ణారెడ్డి ఇంటిలో బుధవారం సాయంత్రం బంగారు గొలుసు చోరీకి గురైంది. కృష్ణారెడ్డి పాలప్యాకెట్ కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇది గమనించిన దొంగ ఇంటిలోకి చొరబడి బీరువాలో ఉన్న ఒకటిన్నర తులం బంగారు గొలుసు చోరీ చేశాడు. అనంతరం వచ్చిన కృష్ణారెడ్డి ఇంట్లో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### పోలీసుల వాటాపై ఉన్నతాధికారుల ఆరా

ఆంధ్రజ్యోతి స్పందన

పుట్లూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొందరు పోలీసు సిబ్బందిపై ఉన్నతాధికారులు ఆరాతీసినట్లు సమాచారం. పోలీసులు ఓ వైసీపీ నాయకుడి డబ్బులు తీసున్నారనే విషయంపై ఆంధ్రజ్యోతిలో బుధవారం మీ వాటా మీకు ఇచ్చాం కదా అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో జిల్లా పోలీసు అధికారులు విషయంపై ఆరాతీసినట్లు తెలిసింది. ఎవరికి డబ్బులు ఇచ్చారు, ఎంత మేర ఇచ్చారని సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి మరీ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. రూ.55వేలు ఫోన్‌పే స్క్రీన్‌షాట్లు పెట్టేలా చూడాలని ఓ అధికారి చెప్పినట్లు తెలుస్తోంది. కాగా సదరు వైసీపీ నాయకున్ని స్టేషన్‌కు పిలిపించి మరోసారి హెచ్చరించినట్లు తెలిసింది. డబ్బులు ఇస్తే మాత్రం ఇలా స్టేషన్ లో హంగామా చేస్తావా అంటూ తమదైనశైలిలో పోలీసులు హెచ్చరించినట్లు సమాచారం.